ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
5
ఆదివారం 29 జూన్ 2025

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులకు దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేట కల్చరల్, జూన్ 28 : జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తుందని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ విద్యాసంవత్సరానికిగానూ జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు జూలై13లోగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.



పలక బలపం పట్టలేదు.. సదువు రాదు.. అక్షర ముక్క రాదు. మా అవ్వ పాట పాడుతుంటే విని నేర్చుకున్న సొంతంగా పాట రాయలే. ఎవరైనా పాట రాసి వినిపిస్తే గుర్తుపెట్టుకుని పాటలు పాడుతున్న..

\- కనకవ్వ

పండ్ల గంప వదిలి..

పాటకు కదిలి..

సండే స్పెషల్ (Sunday Special) 7

పల్లె పాటల పూదోట గొట్టే కనకవ్వ

- ఆరుపదుల వయస్సులో సింగర్‌గా రాణింపు
- సినిమాల్లోనూ నటిగా అవకాశాలు
- పుట్టి పెరిగింది సిద్దిపేట జిల్లా బొడిగెపల్లిలోనే..
- బతుకుదెరువు కోసం పెద్దపల్లి జిల్లాకు మకాం

తల్లి చెంత జానపద పాటలను నేర్చి.. చేనులో నాట్లు వేస్తూ చెమటచుక్కల అలసటన మరిచేలా పాడుతూ పల్లెపాటలను వంటబట్టించుకున్న మట్టిగంధం గొట్టే కనకవ్వ. 'గెన్నెరామ గెట్టు మీద గున్న మామిడి పిల్లదో' అంటూ టీవీలో ప్రారంభమై, 'సమ్మక్క సారక్క వీరుల జాతరా', 'నర్సపల్లి గండి లోన గంగాధరి' అని యూట్యూబ్‌లో సంచలనం స్పష్టించి, వెండితెరపై వెలుగుతున్న మన అవ్వ.. కనకవ్వ.

అక్బరుపేట-భూంపల్లి పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే అన్నపూర్ణ అనే మహిళను తీవ్రంగా గాయపరిచి ఆమె మెడలోని 4 తులాల పుస్తెలతాడును అపహరించారు. దుండగుల దాడిలో ఆమె తీవ్రగాయాలపాలై అపస్మారక స్థితికి చేరి ఆసుపత్రిలో చేరింది. ఇప్పటివరకు నిందితుల ఆచూకీ దొరకలేదు. సంచలనం సృష్టించిన ఈ ఘటన ఈనెల 20న చోటు చేసుకుంది.

చిన్నకోడూరు మండలం కమ్మర్లపల్లి గ్రామంలో కిరాణషాపు నిర్వహిస్తున్న గాలి బాలలక్ష్మిపై గుర్తు తెలియని దుండగులు దాడిచేశారు. ఆమె గొంతు కోసి పుస్తెల తాడు అపహరించారు. ఈ సంఘటనతో కమ్మర్లపల్లి గ్రామం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఈ ఘటన మే 30వ తేదీన చోటుచేసుకున్నప్పటికీ నిందితులను పట్టుకోలేదు. పోలీసుల విచారణ సాగుతోంది.

గజ్వేల్ మండలం ధర్మారెడ్డిపల్లిలో ఈనెల 24వ తేదీన నల్ల సత్తమ్మ అనే వృద్ధురాలిని దారుణంగా హత్య చేశారు. ఆమె మెడలో ఉన్న నగలను అపహరించారు. ఇప్పటివరకు దుండగుల ఆచూకీ తెలియరాలేదు. పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. 2.5 తులాల బంగారు ఆభరణాల కోసం నిండు ప్రాణాన్ని బలితీసుకోవడంతో ఈ ప్రాంతంలో భయాందోళనలు నెలకొన్నాయి.



రాయపోల్ మండలం కొత్తపల్లిలో దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు



కమ్మర్లపల్లిలో నగల కోసం దొంగలు గొంతు కోయడంతో చనిపోయిన బాలలక్ష్మి

ధర్మారెడ్డిపల్లిలో దొంగల చేతిలో హతమైన సత్తమ్మ

దొంగా.. దొంగా

- జిల్లాలో చోరీలు, దోపిడీల కలకలం
- ఆభరణాలు, నగదు కోసం దాడులు
- హత్యలకు సైతం వెనకాడని పరిస్థితి
- పోలీసులకు సవాల్‌గా కేసుల విచారణ
- నెలరోజులుగా భయాన్ని పుట్టిస్తున్న ఘటనలు
- నిరంతరం గస్తీ పెంచాలంటున్న స్థానికులు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జూన్ 28 : సిద్దిపేట జిల్లాలో నెలరోజులుగా దొంగలు ఆగడాలు మితిమీరిపోతున్నాయి. జిల్లా నలువైపులా దొంగతనాలు, దోపిడీలకు పాల్పడుతూ భయాందోళనలు కలిగిస్తున్నారు. ముఖ్యంగా ఒంటరి మహిళలను టార్గెట్ చేస్తున్నారు. వృద్ధులపై ఫోకస్ పెడుతున్నారు. తాళం వేసిఉన్న ఇళ్ల వద్ద రెక్కీ నిర్వహిస్తున్నారు. రాత్రి, పగలు అనే తేడాలేకుండా అందినకాడికి దోచుకెళ్తున్నారు.

మహిళలే టార్గెట్‌గా..

జిల్లాలో తాజాగా జరిగిన సంఘటనలన్నీ మహిళలను టార్గెట్ చేసినవే కావడం గమనార్హం. ఒంటరిగా ఉన్న మహిళలను వెంబడిస్తూ వారిపై ఉన్న బంగారు, వెండి ఆభరణాలను అపహరిస్తున్నారు. ఎదురుతిరిగితే దాడులకు పాల్పడుతున్నారు. అవసరమైతే గొంతు కోసి హత్యలకు పాల్పడిన ఘటనలు సైతం జిల్లాలో ఉన్నాయి. ఇప్పటివరకు ముగ్గురు మహిళలను నగల కోసం హత్య చేశారు. వీరంతా కూడా 50 ఏళ్ల పైబడినవారే. ఒంటరిగా ఉన్నప్పుడే వీరిపై దాడికి తెగబడ్డారు. మరో మహిళ ప్రాణాపాయస్థితిలో చికిత్స పొందుతుంది. కొన్ని చోట్ల దొంగలకు భయపడి ఉన్నదంతా అప్పగించిన పరిస్థితి నెలకొంది. ఒంటరిగా వెళ్లాలంటేనే మహిళలు జంకుతున్నారు.

పోలీసులకు సవాల్‌గా..

జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న దొంగతనాలు, దోపిడీలు, చైన్‌స్నాచింగ్‌లు పోలీసులకు సవాల్‌గా మారుతున్నాయి. నిందితులను పట్టుకోవడంలో ఇబ్బంది పడుతున్నారు. రెండుమూడు దొంగతనాల కేసులను మాత్రమే చేధించగా మిగితా కేసులన్నీ దర్యాప్తులోనే కొనసాగుతున్నాయి. నెలలకొద్దీ విచారణ జరుపుతూనే ఉన్నారు. సీసీ కెమెరాలు, ఇతర సాంకేతిక టెక్నాలజీ ఉన్నప్పటికీ నిందితులను పట్టుకోవడంలో పోలీసులు విఫలమవుతున్నారు. గడిచిన జనవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో జరిగిన దొంగతనాలను సైతం చేదించలేకపోయారు. దొంగతనాలపై ప్రత్యేక దృష్టిసారించిన చోట పలువురు పోలీసులు కేవలం 24 గంటల్లోనే కేసులు చేదించారు. మిగితా చోట్ల మాత్రం దర్యాప్తుతోనే కాలక్షేపం చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. రోడ్డుపై ఒంటరిగా వెళ్లాలంటేనే భయపడే పరిస్థితుల నుంచి మహిళల్లో మనోధైర్యం నింపే విధంగా పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



అక్బరుపేట - భూంపల్లిలో దొంగల దాడికి గురైన అన్నపూర్ణ

ఏ వైపు నుంచి ఏ ఆపద ముంచుకొస్తుందోనని ఆందోళన చెందుతున్నారు.

దొంగల హల్‌చల్

- రాయపోల్ మండలం కొత్తపల్లిలో తాళాలు వేసి ఉన్న రెండు ఇళ్లలో ఈనెల 2వ తేదీన దొంగతనాలు

మిగతా 8వ పేజీలో



గోరింటాకు సందడి

ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని సిద్దిపేటలోని ఎస్ఆర్ డీజీ స్కూల్‌లో గోరింటాకు పండుగను సందడిగా నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొని తమ పిల్లలకు గోరింటాకు పెట్టారు. ఈ పోటీల్లో గెలిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు.

\- సిద్దిపేట కల్చరల్, జూన్ 28



మైదాకు పండుగ

- ఆషాఢమాసం స్పెషల్..
- గ్రామాల్లో మొదలైన సందడి
- ఎంత ఎర్రగా పండితే అంత మంచిదని నమ్మకం
- ప్రకృతి సిద్ధమైన మైదాకుకు ప్రాధాన్యం

7

వనమహోత్సవ లక్ష్యాలను పూర్తిచేయాలి : కలెక్టర్



స్వచ్ఛ సర్వేక్షణ్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, జూన్ 28 : వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా వివిధ మండలాలకు ఇచ్చిన లక్ష్యాన్ని తప్పనిసరిగా పూర్తి చేయాలని కలెక్టర్ కె.హైమావతి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గ్రామీణాభివృద్ధి, గ్రామపంచాయతీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో వనమహోత్సవం కార్యక్రమ ముందస్తు కార్యాచరణను రూపొందించి అమలు చేయాలని సూచించారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా గుర్తించిన వివిధ ప్రాంతాల్లో మొక్కలను నాటాలన్నారు. నాటగానే టీజీఎఫ్ఎంఎస్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. వేప, రావి, మర్రి, చింత, నేరేడు లాంటి మొక్కలు ఎక్కువ శాతం నాటాలని సూచించారు. ఉద్యానవన శాఖ అధికారులకు పలు కలెక్టర్ సూచనలు చేశారు. గ్రామాల్లో ముఖ్యంగా పన్ను వసూలు, మిషన్ భగీరథ తాగునీటి సరఫరాపై దృష్టి సారించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. గ్రామపంచాయతీ ఎన్నికలకు ముందస్తుగా సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ 2025 వాల్‌పోస్టర్‌ను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో రమేష్, డీఆర్డీవో జయదేవ్ ఆర్య, డీపీవో దేవకీదేవి, పంచాయతీరాజ్ ఈఈలు శ్రీనివాస్‌రెడ్డి, చిరంజీవులు తదితరులు పాల్గొన్నారు. వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక, మత్స్య శాఖల అధికారులకు కేటాయించిన లక్ష్యాలపై అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్‌తో కలిసి సిద్దిపేట కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం జిల్లా కలెక్టర్ హైమావతి సమీక్షించారు. నిర్ధేశిత లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

'బాస్' సద్వినియోగం చేసుకోవాలి

- అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్



అదనపు కలెక్టర్ సమక్షంలో డ్రా తీస్తున్న విద్యార్థి

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, జూన్ 28 : బెస్ట్ అవైలేబుల్ పాఠశాల పథకం(బాస్)ను షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్ తెలిపారు. శనివారం సిద్దిపేటలోని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన బాస్ విద్యార్థుల ఎంపికను, డ్రా పద్ధతిన నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్ మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులకు సిద్దిపేట, గజ్వేల్, ప్రజ్ఞాపూర్‌లోని ఎంపిక చేసిన పాఠశాలలో వసతితో కూడిన ఉచిత విద్యనందిస్తామని తెలిపారు. 1వ తరగతికి 225 మంది, 5 తరగతికి 132 మంది దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా కేటాయింపు చేశామని తెలిపారు. 1వ తరగతికి 87 సీట్లకు, 5వ తరగతిలో 89 సీట్లకు లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌డీవో కవిత, జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఏఎస్‌డబ్ల్యూవో హమీద్, అధికారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యువత సన్మార్గం కోసం దీక్ష..

హుస్నాబాద్ జేఏసీ పోరుయాత్ర

- 160 గ్రామాల్లో ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమం
- మాదక ద్రవ్యాల నియంత్రణే లక్ష్యం

హుస్నాబాద్‌రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అలుపెరగని పోరాటం చేసిన తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజేఏసీ) నేడు యువతను సన్మార్గంలో నడిపేందుకు నడుం బిగించింది. రాష్ట్రంలో పెరుగుతున్న మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టే లక్ష్యంతో 'డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్ర'ను చేపట్టింది. హుస్నాబాద్ నియోజకవర్గంలో 160 గ్రామాల్లో ప్రజలను చైతన్యపరుస్తూ, డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేస్తోంది.

60 రోజులుగా యాత్ర

తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన టీజేఏసీ నాయకులు, నేడు రాష్ట్రంలో యువత మత్తు పదార్థాలకు బానిసలవుతున్న తీరుపై ఆందోళన చెందుతున్నారు. డ్రగ్స్, గంజాయి, లోన్ యాప్స్, బెట్టింగ్‌లు, ఆన్‌లైన్ గేమ్‌ల వల్ల జరుగుతున్న అమానుష ఘటనలు, కుటుంబాల విచ్ఛిన్నం అవుతున్న వైనం వారిని కలచివేసింది. ఈ నేపథ్యంలో, యువతను సన్మార్గంలో నడిపించేందుకు ఏప్రిల్ 21న హుస్నాబాద్ నియోజకవర్గంలోని భీమదేవరపల్లి మండలం మాణిక్యాపూర్‌లో 'డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్ర'ను ప్రారంభించారు. 60 రోజులుగా ఈ యాత్ర నియోజకవర్గంలోని భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, సైదాపూర్, చిగురుమామిడి, కోహెడ, అక్కన్నపేట, హుస్నాబాద్ మండలాల్లో కొనసాగుతోంది.



డ్రగ్స్ నిర్మూలనపై గ్రామాల్లో మహిళలకు అవగాహన కల్పిస్తున్న జేఏసీ నాయకుల బృందం

గ్రామాల్లో విస్తృత అవగాహన

టీజేఏసీ నాయకులు గ్రామగ్రామాన మహిళలు, యువతీ, యువకులు, గ్రామస్థులను కలుసుకుని డ్రగ్స్, మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను కరపత్రాల ద్వారా, గ్రామసభల ద్వారా, మహిళా గ్రూపుల ద్వారా వివరిస్తున్నారు. మద్యం మత్తులో జరిగే నేరాలు, లోన్ యాప్‌ల వేధింపులతో ఆత్మహత్యలు, గంజాయి మత్తులో బాలికలపై

మిగతా 8వ పేజీలో

కేంద్రం కఠిన చర్యలు తీసుకోవాలి



దేశవ్యాప్తంగా మాదక ద్రవ్యాల వాడకం పెరిగి యువత నేరాలకు పాల్పడుతున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. కేంద్ర ప్రభుత్వం తక్షణమే కఠిన చట్టాలు తీసుకురావాలి. తాము ఊహించిన దానికన్న గ్రామాల్లో డ్రగ్స్, మత్తుపదార్థాలు, గుట్కాలు వాడకం విపరీతంగా విస్తరించింది. గ్రామాల్లో బెల్ట్‌షాపుల విస్తరణతో అనేక కుటుంబాలు విచ్ఛిన్నం అవుతున్నాయి.

\- కవ్వ లక్ష్మారెడి, నియోజకవర్గ జేఏసీ కన్వీనర్

మంత్రిగారూ.. వట్టి మాటలు కట్టిపెట్టి పని చేసి చూపండి

పొన్నంకు మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ హితవు

8

చిరు జల్లులు పడినా ఇక్కట్లే

- రెండేళ్ల క్రితమే సూరంపల్లి కెనాల్‌పై బ్రిడ్జి నిర్మాణం
- రోడ్డుపై గుంతల్లో నిలుస్తున్న నీరు

కల్యాణం.. కష్టాలమయం!

●నిరుపయోగంగా టీటీడీ 'మండపం' ● రూ.లక్షలు వెచ్చించి నిర్మాణం ● పట్టించుకునే వారు కరువు


నిరుపయోగంగా మారిన టీటీడీ కల్యాణ మండపం

నారాయణఖేడ్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పేద, మధ్య తరగతి వారి ప్రయోజనం కోసం తిరుమల, తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన కల్యాణ మండపం నిర్వాహణ లేక నిరుపయోగంగా మారింది. దశాబ్ధాల క్రితం ఇంటి ముందు వివాహం జరిపిస్తే శుభకరమని భావించేవారు. మారుతున్న పరిస్థితుల్లో ఇళ్ల ముందు వివాహాలు జరిపించడం కష్టతరంగా మారడంతో కల్యాణ మండపాలు, కమ్యూనిటీ హాళ్లలో వివాహాది శుభకార్యాలు జరిపించడం ఆనవాయితీగా మారింది. ప్రజల అవసరాలను గుర్తించిన టీటీడీ వారు నాలుగు దశాబ్ధాల క్రితం ప్రధాన పట్టణాల్లో కల్యాణ మండపాలను నిర్మిస్తున్నారు.. ఇందులో భాగంగా 1994లో నారాయణఖేడ్‌లో టీటీడీ కల్యాణ మండపం నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే కిష్టారెడ్డి, టీటీడీ బోర్డు మెంబర్‌గా ఉన్న సమయంలో నిధులను మంజూరు చేయించారు. దీంతో నిర్మాణం పనులు పూర్తి కావడంతో 2002లో అప్పటి రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి కరణం రాంచందర్‌రావు చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయించారు. అనంతరం తక్కువ ఖర్చుతో కల్యాణ మండపం అందుబాటులోకి రావడంతో నారాయణఖేడ్ పట్టణ వాసులే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల వారు కూడా ఖేడ్ కల్యాణ మండపంలో వివాహాది శుభకార్యాలు జరిపించే వారు. అప్పట్లో నిర్మించిన కల్యాణ మండపం స్థల భావంతో ఇబ్బందులు ఎదురవుతుండంతో, తిరిగి కిష్టారెడ్డి పైభాగంలో మ్యారేజ్ హాల్ నిర్మింప చేయడానికి రూ.40 లక్షలు మంజూరు చేయించడంతో, 15 సంవత్సరాల క్రితం ఆ పనులు కూడా పూర్తి అయ్యాయి. ఇంకా కింది భాగంలో వసతుల కల్పనకు నిధుల సమస్య, ప్రహరీ నిర్మాణం లేక పోవడంతో పై అంతస్తు పనులు పూర్తి అయిన కల్యాణ మండపాన్ని వినియోగించలేని పరిస్థితి నెలకొంది. ఈక్రమంలో పట్టణంలో ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లు ఏర్పాటు కావడంతో జనాలు గత్యంతరం లేక అధిక డబ్బులకు వాటిని వివాహాది శుభకార్యాలకు వినియోగిస్తున్నారు. లక్షలు వెచ్చించి పట్టణం నడి బొడ్డున నిర్మించిన కల్యాణ మండపం నిర్వాహణ గురించి పట్టించుకోక పోవడంతో మండపంలో వివాహాది శుభకార్యాలు జరుపుకోలేని పరిస్థితి ఉంది. గత సంవత్సరం కల్యాణ మండపం నిర్వాహణ కోసం టీటీడీ అధికారులు టెండర్లను పిలిచినప్పటికీ, ఏడాది దాటినా టెండర్ల ప్రక్రియను పూర్తి చేయక పోవడంతో, కల్యాణ మండపాన్ని ఎవ్వరూ వినియోగించలేని స్థితిలో ఉంది. కల్యాణ మండపం నిర్వాహణ చర్యలు చేపట్టడానికి తోడు టాయిలెట్స్, నీటి వసతి, కల్పించి ప్రహరీ నిర్మిస్తే పేద, మధ్యతరగతి వారికి ఉపయోగపడుతుందని, పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా టీటీడీ అధికారులు అందరికి ఉపయోగపడే విధంగా ఉన్న నారాయణఖేడ్ కల్యాణ మండపం నిర్వాహణ చేపట్టి, అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

కల్యాణ మండపాన్ని వినియోగంలోకి తీసుకురావాలి



పేద, మధ్యతరగతి వారి సౌలభ్యం కోసం టీటీడీ ఆధ్వర్యంలో కల్యాణ మండపాన్ని నిర్మించినప్పటికీ, నిర్వాహణ చర్యలు లేక నిరుపయోగంగా మారిందని జూకల్ గ్రామానికి చెందిన శంకరప్ప అన్నారు. టీటీడీ కల్యాణ మండపం వినియోగంలోకి వస్తే పేద, మధ్యతరగతి వారు తక్కువ ఖర్చుతో వివాహాది శుభకార్యాలు జరుపుకోగలుగుతారు.

- శంకరప్ప

కోడూరు టు కొండారెడ్డిపల్లి

● రూ.4.69 కోట్లతో రోడ్డు పునరుద్ధరణ

● 7 కిలో మీటర్లు బీటీగా మార్పు


మిషన్ సహాయంతో చేపడుతున్న బీటీ రోడ్డు పనులు

పుల్‌కల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడూరు నుంచి అందోలు మండలం కొండారెడ్డిపల్లి చౌరస్తా వరకు గల రహదారి దశ మారబోతోంది. ఈ రహదారి పునరుద్ధరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కోడూరు నుంచి గిరిజన తండా మీదుగా బొమ్మారెడ్డిగూడెం, లక్ష్మీసాగర్, కొండారెడ్డిపల్లి చౌరస్తా వరకు 7 కిలో మీటర్ల రహదారి పూర్తిగా ధ్వంసమయింది. దీంతో నియోజకవర్గ కేంద్రమైన జోగిపేట పట్టణానికి వెళ్లాలంటే ఈ ప్రాంత ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డుపై ప్రయాణించాలంటేనే ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ నేపథ్యంలో కన్‌స్ట్రక్షన్ ఆఫ్ రూరల్ రోడ్స్ (సీఆర్‌ఆర్) కింద రూ.4.69 కోట్లు ప్రత్యేక నిధులు మంజూరు చేయగా, గత ఏడాది నవంబర్‌లో పనులను ప్రారంభించారు. ప్రస్తుతం మూడు కిలో మీటర్ల దూరం వరకు బీటీ రహదారి పనులను పూర్తి చేశారు. కోడూరు నుంచి అందోలు మండలం కొండారెడ్డిపల్లి చౌరస్తా వరకు 7 కిలో మీటర్లు బీటీ రహదారి పనులు పూర్తి చేయనున్నారు. దీంతో ఈ ప్రాంత ప్రజలు నియోజకవర్గ కేంద్రమైన జోగిపేటకు వెళ్లేందుకు ప్రయాణం ఇక సులభతరం కానున్నది.

7 కిలో మీటర్లు పూర్తి చేస్తాం

సంగారెడ్డి-సింగూరు ప్రధాన రహదారికి అనుకుని కోడూరు గిరిజన తండా, బొమ్మారెడ్డిగూడెం, హన్మానాయక్ తండా, లక్ష్మీసాగర్ గ్రామాల మీదుగా కొండారెడ్డిపల్లి చౌరస్తా వరకు 7 కిలో మీటర్లు బీటీ రోడ్డుగా మారుస్తాం. ఇప్పటి వరకు మూడు కిలో మీటర్లు బీటీ రోడ్డుగా మార్చాం. మిగిలిన ఐదు కిలో మీటర్ల దూరం రోడ్డు పనులు శరవేగంగా సాగుతున్నాయి.

- పీఆర్ ఏఈఈ శశికుమార్

రైలు పట్టాలపై పడుకొని యువతి ఆత్మహత్య

తూప్రాన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రైలు పట్టాలపై పడుకొని ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన శనివారం మెదక్ జిల్లా తూప్రాన్ మండలం బ్రాహ్మణపల్లి రైల్వేస్టేషన్‌లో జరిగింది. కామారెడ్డి రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. శివ్వంపేట మండలం దొంతి గ్రామానికి చెందిన శావర్తి స్వర్ణలత (27) మనోహరాబాద్ మండలం రామాయపల్లి వద్దగల ఇండూస్ మెడికేర్ కంపెనీలో పనిచేస్తోంది. శనివారం ఉదయం కంపెనీ విధులకు హాజరైన స్వర్ణలత మధ్యాహ్నాం ఇంటికి బయలుదేరింది. బ్రాహ్మణపల్లి రైల్వేస్టేషన్‌కు వచ్చిన ఆమె సాయంత్రం హైదరాబాద్ నుంచి జైపూర్ వెళ్తున్న స్పెషల్ రైలుకు అడ్డుగా పట్టాలపై పడుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. కామారెడ్డి పోలీసులు పంచనామా అనంతరం మృతదేహాన్ని కామారెడ్డి ఆసుపత్రికి తరలించారు. యువతి ఆత్మహత్యకు ముందు రైల్వేస్టేషన్‌లో ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడినట్లు సమాచారం.

వంతెనను ఢీకొన్న లారీ..

●తప్పిన ప్రమాదం

సిద్దిపేట రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఓ లారీ అదుపుతప్పి వంతెనను ఢీ కొట్టింది.ఈ సంఘటన శనివారం ఉదయం నారాయణరావుపేట మండలం మల్యాల శివారులో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట నుంచి సిరిసిల్ల వైపు వెళ్లున్న లారీ ఆదిపేరుమాళ్ల దేవాలయం సమీపంలోని ఇరుకు బ్రిడ్జి వద్ద ఎదురుగా వచ్చిన వాహనాన్ని తప్పించబోయి కల్వర్టు సైడ్ వాల్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఏమీ కాకపోవడంతో క్షణాల్లో పెనుప్రమాదం తప్పిందని వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు. ఇరుకుగా ఉన్న బ్రిడ్జిని నూతనంగా నిర్మించాలని పలుమార్లు అధికారులకు, మంత్రులకు విన్నవించిన పట్టించుకున్న దాఖాలాలు లేవని వాహదారులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అనారోగ్యంతో హెడ్‌కానిస్టేబుల్ మృతి


హెడ్‌కానిస్టేబుల్ పండరి(ఫైల్)

నర్సాపూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మైసగోనిపండరి(53) అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పండరి 1992లో కానిస్టేబుల్‌గా నియామకమై వివిధ పోలీస్‌స్టేషన్లలో పనిచేసి ప్రస్తుతం నర్సాపూర్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో హైదరాబాద్ శివారులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరగా అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడు హెడ్‌కానిస్టేబుల్‌కు భార్య చంద్రకళతో పాటు ఒక కుమారుడు, ఒక కూతురు ఉన్నారు. పండరి ఇక్కడ విధులు నిర్వహిస్తు స్థానికులతో మంచి వ్యక్తిగా పేరుతెచ్చుకున్నాడు. అనారోగ్యంతో అకాల మరణం చెందడం పట్ల స్థానిక పోలీసులతో పాటు పలువురు కూడా ఆ కుటుంబానికి ప్రగాడ సానుభూతి వ్యక్తం చేస్తు సంతాపం వ్యక్తం చేశారు.

తాళం పగలగొట్టి చోరీ

● 3 తులాల పుస్తెలతాడు, 2000 నగదు అపహరణ

టేక్మాల్ జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తాళం పగలగొట్టి గుర్తుతెలియని వ్యక్తులు ఓ ఇంట్లో చోరీ చేశారు. ఈ సంఘటన మండల కేంద్రమైన టేక్మాల్‌లో జరిగింది. టేక్మాల్ ఎస్సై రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మల్లని భాగ్య దంపతులు హైదరాబాద్‌లో జీవనం సాగిస్తున్నారు. భాగ్య కొన్ని రోజులుగా గ్రామంలోనే ఉంటుంది. శుక్రవారం రాత్రి ఇంటి ఆవరణలో పాముల భయంతో పక్కన ఉన్న వారి కిష్టయ్య ఇంట్లో నిద్రించేందుకు వెళ్లింది. శనివారం ఉదయం లేచి ఇంటికి వచ్చి చుడాగానే ఇంటికి ఉన్న తాళం పగలకొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని లాకర్ పగిలిపోయి ఉంది. లాకర్‌లో ఉన్న 3తులాల బంగారం, పుస్తెలతాడు, అందులో ఉన్న 2000 నగదు చోరీ చేశారు. పోలీసులు సంఘటన స్థలనికి చెరుకుని ఆధారాలను పరిశీలించారు. భాగ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.

చేపలు పట్టే విషయంలో వివాదం

●అడ్డుకున్న పోలీసులు

చేగుంట జూన్ 28 (ఆంధ్రజ్యోతి): చేపల చెరువు విషయంలో గ్రామంలోని ఇరు వర్గాల మధ్య మళ్లీ వివాదం నెలకొంది. మెదక్ జిల్లా నార్సింగి మండలం వల్లూరు గ్రామంలో దాదాపు సంవత్సరం నుంచి ఇరు వర్గాల మధ్య చెరువులలో చేపలు పట్టే విషయంలో గొడవ జరుగుతోంది. మత్స్యశాఖ నుంచి ముదిరాజులు సొసైటీగా ఏర్పడి చెరువులను తమ పేరున రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. కోర్టు ఉత్తర్వులను తెచ్చుకుని ముదిరాజులు చెరువులో చేపలు పట్టడానికి సన్నాహాలు చేస్తుండగా గ్రామస్థులు అడ్డుకున్నారు. ఈ విషయమై గతంలో రామాయంపేట సీఐ వెంకటరాజా గౌడ్ మత్స్య శాఖ అధికారుల సమక్షంలో ఇరు వర్గాలను సముదాయించారు. శనివారం ఉదయం పలువురు దాదాపు ఇరవై మంది, మినీ లారీ తీసుకుని చెరువు వద్దకు చేపలు పట్టడానికి వెళ్లారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు చెరువు వద్దకు వెళ్లి వారిని అడ్డుకుని, గ్రామ సొసైటీగా ఉన్న మదిరాజులు మాత్రమే చేపలు పట్టాలని, వేరే ప్రాంతం నుంచి వచ్చిన వారు చేపలు పట్టవద్దని గ్రామస్థులు అడ్డుకున్నారు. గతంలో పంచాయతీ విషయంలో అలా చేస్తే సొసైటీ రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామని పంచాయతీ పెద్దలు గ్రామస్థులుకు హామీ ఇచ్చారని చెప్పారు. దాంతో మినీ లారీని అడ్డుకున్నారని వారిని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విషయాన్ని తెలుసుకున్న రామాయంపేట సీఐ వెంకటరాజా గౌడ్ ఎస్సై అహ్మద్ మొహీనుద్దిన్ మత్స్య శాఖ అధికారుల సమక్షంలో ఇరు పక్షాలతో చర్చలు జరిపి సముదాయించారు.

దొంగతనాల కేసుల్లో నిందితుడి రిమాండ్

బెజ్జంకి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): దొంగతనాల కేసుల్లో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తిరుపతిరెడ్డి తెలిపారు. మండలంలో ఇటీవల జరుగుతున్న దొంగతనాల విషయంలో పోలీసులు టీమ్‌లుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో బెజ్జంకి క్రాసింగ్ వద్ద శనివారం అనుమానాస్పదంగా తిరుగుతున్న గుండారం గ్రామానికి చెందిన వాసంపల్లి మధుసూదన్ రెడ్డిని పోలీసులు పటుకుని విచారించారు. గుండారం గ్రామానికి చెందిన బొంతల సుజాత, బోడపట్ల ఎల్లవ్వ ఇళ్లల్లో చోరికి పాల్పడినట్లు నిందితుడు అంగీకరించాడు. రెండు ఇళ్లల్లో చోరీ చేసిన బంగారు, వెండి ఆభరణాలను మండల కేంద్రంలోని ముత్తూట్ మనీ లిమిటెడ్‌లో తాకట్టు పెట్టాడు. రెండు కేసుల్లో రెండున్నర తులాల బంగారు ఆభరణాలు, 67 తులాల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హజరు పరచి రిమాండ్‌కు తరలించారు.

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

హవేళిఘణపూర్, జూన్28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌట్లపల్లి గ్రామంలో శనివారం ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన చీమల చంద్రయ్య(52) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. చంద్రయ్య కొన్ని రోజుల క్రితం 20 గుంటల పొలాన్ని అప్పు చేసి కొనుగోలు చేశాడు. అప్పులు ఎలా తీరుతాయోనని ఎప్పుడూ బాధపడుతుండేవాడు. ఉదయం పొలంలోని గట్లకు గడ్డి మందు పిచికారి చేస్తానని మందు తీసుకెళ్లి గ్రామ సమీపంలో గడ్డి మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన గ్రామస్థులు మెదక్ ప్రభుత్వ హాస్పిటల్‌కు తరిలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. చంద్రయ్య తల్లి బాలమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.



జోగిపేటలోని ఏరియా ఆస్పత్రిలో బాలింతతో మాట్లాడుతున్న సంగారెడ్డి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

● వైద్యులకు డీసీహెచ్ఎస్ డాక్టర్ సంగారెడ్డి ఆదేశం

జోగిపేట, జూన్28(ఆంధ్రజ్యోతి : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన చికిత్సలు అందించాలని జిల్లా ప్రభుత్వాస్పత్రులు, సేవల సమన్వయకర్త (డీసీహెచ్ఎస్) డాక్టర్ సంగారెడ్డి వైద్యులకు సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో ఆయన శనివారం జోగిపేటలోని ఏరియా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతీ వార్డును కలియ తిరిగారు. ఆపరేషన్ థియేటర్లు, ఎక్స్‌రే, ల్యాబ్ గదులు, ఓపీలో సేవలను పరిశీలించారు. ఫార్మసీ రికార్డులు, వైద్యులు, సిబ్బంది హాజరు రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే వారంతా నిరుపేదలేనని, ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా సేవలందించాలన్నారు. ఫిర్యాదులు వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఆయన వెంట ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ అశోక్, సూపరింటెండెంట్ డాక్టర్ సౌజన్య, సిబ్బంది ఉన్నారు.

అమ్మా.. సమస్యలేమైనా ఉన్నాయా?

● వృద్ధాశ్రమాన్ని సందర్శించిన జూనియర్ సివిల్ కోర్టు జడ్జి



వృద్ధ ఆశ్రమంలో సమస్యలు తెలుసుకుంటున్న జడ్జి

నర్సాపూర్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్‌లోని వృద్ధ ఆశ్రమాన్ని శనివారం సాయంత్రం స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి హేమలత ఆకస్మికంగా సందర్శించారు. అక్కడున్న వృద్ధులను ఆప్యాయంగా పలుకరించారు. మీ సమస్యలు ఏవైనా ఉన్నాయా.. ఆశ్రమ నిర్వాహకులు బాగా చూసుకుంటున్నారా.. అంటూ ఆరా తీస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడున్న వృద్ధులకు పింఛన్ రావడం లేదని కొందరు జడ్జి దృష్టికి తీసుకెళ్లగా, సంబంధిత అధికారులతో మాట్లాడి వచ్చేలా చూస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఏ సమస్య ఉన్నా స్థానిక మండల లీగల్ సర్వీసెస్ కమిటీ దృష్టికి తేవాలని సూచించారు.

పది రోజుల్లో 127 మొబైల్ ఫోన్ల రికవరీ

● బాధితులకు అప్పగించిన మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు



బాధితులకు సెల్‌ఫోన్లు అప్పగిస్తున్న జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

మెదక్ అర్బన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇటీవలి కాలంలో దొంగతనానికి గురైన 127 మొబైల్ ఫోన్లను పది రోజుల్లోనే గుర్తించి శనివారం బాధితులకు అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మొబైల్ ఫోన్లు చోరీకి గురైన పౌరులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా తమ ఫోన్లను ట్రాక్ చేసి తిరిగి పొందే అవకాశం ఉందన్నారు. చోరీ జరిగిన వెంటనే ఫిర్యాదు చేస్తే దొంగతనమైన మొబైల్ ఫోన్‌లను సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించవచ్చునన్నారు. ఇది ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రగతిశీల టెక్నాలజీపై ఆధారపడిన ఒక గొప్ప సాధనమని తెలిపారు. ప్రజలు, వినియోగదారులు సెకండ్ హ్యాండ్ సెల్‌ఫోన్లు కొనుగోలు చేస్తే.. ఆ దుకాణ యాజమాని నుంచి రసీదు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ప్రజల కోసం పోలీసు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు. సమస్యలు వస్తే పోలీసు సేవలు వినియోగించుకోవాలని సూచించారు. మొబైల్‌ఫోన్లు అందుకున్న బాధితులు ఎస్పీతోపాటు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ మధు సూదన్‌గౌడ్, ఐటీకోర్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సండే స్పెషల్ Sunday Special

పండ్లగంప వదిలి.. పాటకు కదిలి..

సమ్మక్క సారక్క వీరుల జాతరా.. మన మేడారంలో.. ఆదివాసుల అమరుల జాతరా.. మూలవాసుల మన్నెం జాతర.. మన మేడారంలో.. పచ్చని అడవిలో పవిత్ర జాతర, నర్సపల్లి గండిలోన గంగాధరి.. ఆడ నెమలి ఆటలకు గంగాధారి.. మగా నెమలి మోసపోయే గంగాధారి.. అంటూ సాగే ఈ రెండు పాటలు యావత్ తెలంగాణ రాష్ట్రాన్ని ఊపేసింది. ఈ పాటలతో ఫేమస్‌గా మారి.. మరెన్నో పాటలు పాడుతూ ఆరుపదుల వయస్సులో ఫోక్ సింగర్‌గా రాణిస్తున్నారు బొడిగెపల్లి బిడ్డ గొట్టే కనకవ్వ. సినిమాల్లోనూ నటిగా రాణిస్తూ అందరి మన్ననలు పొందుతున్న అచ్చమైన పల్లెటూరి జానపద పాటమ్మపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

- అక్కన్నపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి)





● పల్లె పాటల పూదోట గొట్టే కనకవ్వ
● ఆరుపదుల వయస్సులో సింగర్‌గా రాణింపు
● సినిమాల్లోనూ నటిగా అవకాశాలు
● పుట్టి పెరిగింది సిద్దిపేట జిల్లా బొడిగెపల్లిలోనే..
● బతుకుదెరువు కోసం పెద్దపల్లి జిల్లాకు మకాం

సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం బొడిగెపల్లి గ్రామానికి చెందిన జంగపల్లి ఓదయ్య-రాజవ్వ దంపతులకు ఏడుగురు కుమార్తెలు, ఐదుగురు కుమారులు. 12 మంది సంతానంలో కనకవ్వ నాలుగో కుమార్తె. ఆమెకు చిన్నప్పుడే సిద్దిపేట జిల్లా దుళిమిట్ట మండలం కూటిగల్‌కు చెందిన గొట్టే బాలయ్యతో వివాహంకాగా, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. అత్తగారి ఊర్లో బతకడానికి ఇబ్బందులు ఎదురుకావడంతో తల్లిగారి ఊరైన బొడిగెపల్లికి వచ్చి కూలి పనులు చేసుకుంటూ ఉండేవారు. ఇక్కడ కూడా వర్షాలు లేక వ్యవసాయ బావుల్లో నీరు లేకపోవడంతో బతుకుదెరువు కష్టమవుతుందని హైదరాబాద్‌కి వెళ్లి ఇళ్లలో పని చేసుకుంటూ 10 ఏళ్లు అక్కడే ఉన్నారు.

పండ్ల గంపతో వాడవాడ తిరుగుతూ..

కనకవ్వ తమ్ముడు పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో ఉండడంతో హైదరాబాద్ నుంచి వారి కుటుంబం అక్కడికి మకాం మార్చారు. గోదావరిఖనిలోని ఇందిరానగర్‌లో నివాసముంటూ భర్త మున్సిపల్ కార్మికుడిగా పనిచేస్తుంటే, కనకవ్వ ఏ సీజన్‌లో ఏ పండ్లు వస్తే ఆ పండ్ల గంప ఎత్తుకొని వాడ వాడ తిరిగి విక్రయిస్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉండేది. చిన్నప్పటి నుంచే తన తల్లి రాజవ్వ పాటలు పాడుతుండడంతో తల్లితో పాటే కూలి పనులకు వెళ్లి పాటలు పాడడం అలవాటు చేసుకుంది. ఆ పాటలే ఇప్పుడు కనకవ్వ ఫోక్ సింగర్‌గా ఎదిగేందుకు దోహదపడ్డాయి.

మొదట అవకాశమిలా..

2019లో కనకవ్వ చెల్లె బిడ్డ మంగవ్వ ఓ టీవీ ఛానల్‌లో చూసి ఫోక్ స్టూడియో కార్యక్రమం కోసం సెల్‌ఫోన్‌లో రెండు నిమిషాలు పాట పాడి పంపుమని చెప్పడంతో ఆమె పాట పాడి పంపించింది. అది విన్న ఆ టీవీ ఛానల్ వాళ్లు హైదరాబాద్‌కు రమ్మనడంతో వెళ్లిన కనకవ్వ మొదటిసారి టీవీలో భయభయంగా గెన్నెరామ.. గెన్నెరామ.. గెన్నెరామ గెట్టు మీద గున్న మామిడో పిల్లడో.. పాట పాడారు. అక్కడ ఉన్న వాళ్లు తన పాట విని చప్పట్లు కొట్టి మెచ్చుకున్నారు. మిట్టపల్లి సురేందర్, వరంగల్ శీను, మురళిమధులు కనకవ్వ టాలెంట్‌ను గుర్తించారు. అప్పటినుంచి పండ్ల గంప మూలకు పడేసి ఇప్పటి వరకు 100 పాటలు పాడారు. జానపద గాయని మంగ్లీ, నృత్యకారిణి జాను, గేయ రచయిత, సింగర్ చరణ్‌అర్జున్‌తో పాటు మరికొంతమందితో కలిసి పాటల షూటింగ్‌లో పాల్గొన్నారు కనకవ్వ.

పది సినిమాల్లో నటిగా..

సలార్, దసరా, గుంటూరు కారం, మట్టి కథలు, లగ్నం, చంద్రమండలం, రాకెట్, పొట్టేలు, అంబాజీపేట బ్యాండ్ బాజాలు, జమీందార్ సినిమాల్లో నటించారు. పలక బలపం పట్టలేదు.. అక్షర ముక్క రాదని, వాళ్ల అవ్వ పాట పాడుతుంటే విని నేర్చుకున్నానని చెబుతున్నది కనకవ్వ. ఎవరైనా పాట రాసి వినిపిస్తే గుర్తుపెట్టుకుని పాటలు పాడుతున్నానని, తాను బతికున్నాళ్లు పాటలు పాడుతానని అంటున్నది. తన బిడ్డ కొడుకు రాకేష్ తనను షూటింగ్, రికార్డింగ్‌లకు తీసుకువెళ్తాడని తెలిపింది.

ఉండడానికి ఇల్లు లేదు : కనకవ్వ

ఉండడానికి నాకు సొంత ఇల్లు లేదు. మా కొడుకు ఇంటి వద్దే నేను నా భర్త ఉంటున్నాం. ఇల్లు చిన్నగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నాం. చుట్టాలు వస్తే ఉండడానికి ఇబ్బందిగా ఉంటుంది. మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి ఇల్లు మంజూరు చేయాలని వేడుకుంటున్నా.

మైదాకు పండుగ

ఆషాఢమాసం స్పెషల్.. గ్రామాల్లో మొదలైన సందడి


● ఎంత ఎర్రగా పండితే అంత మంచిదని నమ్మకం
● ఆరోగ్యానికి ఎంతో మంచిది
● ప్రకృతి సిద్ధమైన మైదాకుకు ప్రాధాన్యం



జగదేవ్‌పూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం వచ్చిందంటే చాలు, మహిళలకు మైదాకు (గోరింటాకు) సంబరం మొదలవుతుంది. డోలు వాయిద్యాలు, శివసత్తుల శిగాలు, పోతరాజుల విన్యాసాలతో పాటు, మహిళలు తమ చేతులకు, కాళ్లకు మైదాకు పెట్టుకుని మురిసిపోవడం ఈ మాసంలో సర్వసాధారణం. మైదాకు ఎంత ఎర్రగా పండితే అంత మంచిదని నమ్ముతుంటారు. ఆషాఢం ప్రారంభం కాగానే మైదాకు పెట్టుకోవడానికి మహిళలు పోటీ పడుతుంటారు. ఇప్పటికే గ్రామాల్లో ఈ సందడి మొదలైంది.

అమ్మాయిల నుంచి మగవారి వరకు...

ఆషాఢ మాసం రాగానే చాలా మంది ఆడవారు తమ చేతులకు గోరింటాకు పెట్టుకుని మురిసిపోతుంటారు. ముఖ్యంగా కొత్తగా పెళ్లైన యువతులు అత్తగారింటి నుంచి అమ్మగారింటికి వచ్చినప్పుడు, ఒకటి రెండు రోజులలో తప్పనిసరిగా మైదాకు పెట్టుకుంటారు. కేవలం మహిళలే కాకుండా, గతంలో మగవారు కూడా మైదాకును విధిగా పెట్టుకునేవారు. ఇప్పుడు కొంతవరకు తగ్గినప్పటికీ, ఆషాఢ మాసంలో వారు కూడా పెట్టుకుంటారు. మహిళలు పెట్టుకోగా మిగిలిన ఆకును చేతి మెత్తానికి రుద్దుకొని శుభ్రం చేసుకుంటారు.





మైదాకుతో ఆరోగ్య ప్రయోజనాలు

మైదాకు కేవలం అందానికే కాకుండా, ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఆషాఢంలో వర్షాలు కురిసి వాతావరణం చల్లగా మారుతుంది. ఈ సమయంలో మైదాకు పెట్టుకోవడం వల్ల శరీరంలో వేడి సమతుల్యం అవుతుందని అంటారు. వర్షాల వల్ల పెరిగే సూక్ష్మక్రిములు, అంటువ్యాధులను నివారించడంలో కూడా మైదాకు సహాయపడుతుంది. ఇందులో వేడిని తగ్గించే గుణం ఉండటమే కాకుండా, రోగ నిరోధక శక్తిని పెంచి, రక్త ప్రసరణను సక్రమంగా జరిగేలా చేస్తుంది. అందుకే ప్రతి ఆచారం వెనుక ఆరోగ్య ప్రయోజనాలు దాగి ఉన్నాయని చెబుతారు.

మైదాకు ఎర్రగా పండాలంటే చిట్కాలు

గోరింటాకు మంచి రంగు రావాలంటే కొన్ని చిట్కాలు పాటిస్తారు. మైదాకు రుబ్బేటప్పుడు అందులో నిమ్మరసం, కొద్దిగా చింతపండు కలిపితే బాగా పండుతుంది. మైదాకు పెట్టుకున్న తర్వాత అది పూర్తిగా ఎండి, రాలిపోయే స్థితికి వచ్చాకే తీయాలి. తీసిన వెంటనే చేతులు శుభ్రం చేసుకోకుండా కనీసం అరగంటైనా ఆగి శుభ్రం చేసుకోవాలి. ఆ తర్వాత కొద్దిగా నూనె రాస్తే గోరింటాకు మరింత ఎర్రగా వస్తుంది.

ప్రకృతి సిద్ధానికే మొగ్గు

ప్రస్తుతం చాలా మంది ప్రకృతి సిద్ధమైన మైదాకువైపే మొగ్గు చూపుతున్నారు. ఇంటి ఆవరణలో, గ్రామ పంచాయతీలలో, వ్యవసాయ పనుల వద్ద పెరిగే మైదాకు చెట్ల ఆకులను తెంపుకొని వచ్చి వాటిని రుబ్బుకొని పెట్టుకుంటున్నారు. అయితే, అందరికీ మైదాకు అందుబాటులో లేకపోవచ్చు. అలాంటి వారు మైదాకుకు బదులుగా మెహందీని కూడా పెట్టుకుంటున్నారు. మెహందీతో వివిధ డిజైన్‌లు పెట్టుకోవచ్చని మహిళలు చెబుతారు. అయితే, మెహందీని కొనేటప్పుడు మంచి కంపెనీది, తాజాగా ఉన్నదాన్ని మాత్రమే ఎంచుకోవాలి. నాసిరకం మెహందీని వాడితే ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది.



సివిల్ కోర్టు భవనాన్ని పరిశీలిస్తున్న జిల్లా న్యాయాధికారి భవానీచంద్ర

జిన్నారంలో కోర్టు భవనం పరిశీలన

జిన్నారం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం జిన్నారంలో ఏర్పాటు చేసిన సివిల్ కోర్టును జూనియర్ సివిల్ జడ్జి కమ్ జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ భవనాన్ని జిల్లా న్యాయాధికారి భవానీచంద్ర పరిశీలించారు. జిన్నారంలో కోర్టును ఏర్పాటు చేస్తుండగా ఇటీవలే రూ.8.40 లక్షలతో పలు పనులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్, న్యాయవాదులు శ్రీధర్‌రెడ్డి, బాలకృష్ణ జఫర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ఆందోళన

టేక్మాల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : అర్హులైనవారికే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని టేక్మాల్ గ్రామపంచాయతీ ఆవరణలో లబ్ధిదారులు ఆందోళనకు దిగారు. మండల కేంద్రమైన టేక్మాల్ గ్రామపంచాయతీ ఆవరణలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. గ్రామంలో 41 మంది లబ్ధిదారుల పేర్లను ప్రకటించారు. అందులో కొందరు అనర్హులు ఉన్నా.. వారికే ఇళ్లను కేటాయించడం సరికాదన్నారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు జోక్యం చేసుకుని, రెండోవిడత జాబితాలో అర్హులందరికీ ఇళ్లు మంజూరయ్యేలా చూస్తామని హామీఇచ్చారు.

క్విజ్ పోటీల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



స్టడీ మెటీరియల్, ప్రశంసా పత్రాలను చూపుతున్న విద్యార్థులు

కంది, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మ్యూచువల్ ఫండ్స్ పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించడానికి జాతీయస్థాయిలో నిర్వహించే క్విజ్ పోటీలో మండలంలోని ఆయుధ కర్మాగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థులు సృష్టి, హారిక, రిషిక అద్భుత ప్రతిభ కనబర్చారు. హైదరాబాదులో శనివారం నిర్వహించిన క్విజ్ పోటీలో ఈ ముగ్గురు పాల్గొని ప్రశంసాపత్రాలు, స్టడీ మెటీరియల్ పొందారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు జయంతివాణి, గైడ్ ఉపాధ్యాయుడు అడ్డాడ శ్రీనివాసరావు, ఇతర ఉపాధ్యాయులు రజిత, రవీందర్, సంధ్య విద్యార్థులను అభినందించారు.

నర్సాపూర్‌లో సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం

● మెదక్ జిల్లాలోనే మొట్టమొదటగా ఏర్పాటు
● స్థానిక లక్ష్మీనారాయణస్వామి ఆలయ భూమిని పరిశీలించిన అధికార బృందం
● త్వరలో సర్వే చేసి భూమిని ప్లాంటు కోసం లీజు ఇచ్చేందుకు నిర్ణయం



నర్సాపూర్‌లో స్థల పరిశీలన చేస్తున్న అధికారుల బృందం

నర్సాపూర్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో సోలార్ ద్వారా విద్యుత్ ఉత్పత్తిని పెంచే ఆలోచనలో భాగంగా చేపట్టిన సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు మెదక్ జిల్లాలోనే మొట్టమొదటగా నర్సాపూర్‌లో ఏర్పాటు చేసేందుకు అధికారులు కసరత్తు చేపట్టారు. మెదక్-హైదరాబాద్ జాతీయ రహదారికి ఆనుకుని నర్సాపూర్ పట్టణంలోని లక్ష్మీనారాయణస్వామి ఆలయానికి చెందిన వంద ఎకరాల భూమి ప్రస్తుతం పడావుగా ఉంది. ఆ భూమిని వినియోగంలోకి తేవడంతో అటు దేవదాయ శాఖకు ఆదాయం, ఇటు సోలార్ ఉత్పత్తికి శ్రీకారం చుట్టి మహిళా సంఘాలకు ఆర్థికంగా ఉపాధి కల్పించే వీలుగా స్థలాన్ని కేటాయించాలని నిర్ణయించారు. అందులో భాగంగా గతంలోనే ఈ స్థలాన్ని అధికారులు పరిశీలించి సోలార్ ప్లాంటు ఏర్పాటుకు ఉపయోగకరంగా ఉంటుందని నిర్ణయించారు. ఈ మేరకు శనివారం డీఆర్‌డీఏ రాష్ట్ర సీఏవో కృష్ణారావు, నాబార్డు ఏజీఎం రామకృష్ణ, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్‌రావు, విద్యుత్‌శాఖ ఏడీఈ రమణారెడ్డి, దేవాదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ అధికారి శ్రీనివాస్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మోహన్, ఏపీఎం గౌరిశంకర్, ఏపీవో అంజిరెడ్డిలతో కూడిన బృందం స్థలం పరిశీలించారు. వెంటనే సర్వే చేసి ముందుగా ఎనిమిది ఎకరాలు ప్లాంటు కోసం కేటాయించేందుకు అనువైన చోట ఎంపిక చేసి పెట్టాలని స్థానిక సర్వేయర్‌కు సూచించారు.

వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయాలన్నదే లక్ష్యం: సీఏవో

రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని డీఆర్‌డీఏ రాష్ట్ర సీఏవో కృష్ణారావు పేర్కొన్నారు. నర్సాపూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ సోలార్ ప్లాంట్ల నిర్వహణ బాధ్యతలను ఆయా ప్రాంతాల మహిళ సంఘాలకే అప్పగిస్తామన్నారు. ప్రభుత్వం సబ్సిడీతో పాటు రుణ సదుపాయం కూడా కల్పిస్తుందన్నారు.

నల్లవల్లిలో..

గుమ్మడిదల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి గ్రామ శివారులో త్వరలో ఇందిరా మహిళా శక్తి పవర్ ప్లాంటును ఏర్పాటు చేయనున్నట్లు డీపీఎం జయశ్రీ రాజ్ వెల్లడించారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర స్థాయి సెర్ప్, నాబార్డ్ ప్రతినిధుల బృందంతో కలిసి ఆయన గుమ్మడిదల మండలం నల్లవల్లిలోని ప్రభుత్వ భూమిని పరిశీలించారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌ను నల్లవల్లి మహిళా సంఘాల సభ్యులతో కలిసి పరిశీలించారు. ఇక్కడ ఏర్పాటు చేయబోయే పవర్ ప్లాంట్‌కు ఎదురవుతున్న ఇబ్బందులు, కావలసిన సౌకర్యాలను గురించి చర్చించారు. అలాగే మహిళా సంఘాల సభ్యులకు తగు సూచనలు చేశారు. ప్రాజెక్ట్ స్థాపనకు త్వరలో విధి విధానాలు ఖరారు చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఆయన వెంట సెర్ప్ డైరెక్టర్ కృష్ణారావు, నాబార్డ్ ఏజీఎం రామారావు, నాబార్డ్ కన్సల్టెంట్ రామకృష్ణ, డిస్ట్రిక్ మేనేజర్ రెడెకో రవీందర్ చౌహన్, ఏపీఎం శివకుమార్, సీసీ అలివేలు, మండల సమాఖ్య అధ్యక్షురాలు, యోగేశ్వరి, వీవోఏ అరుంధతి తదితరులు ఉన్నారు.

మంజీరా బ్యారేజీకి ముప్పులేదు

● వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నగరానికి తాగునీరు అందించే మంజీరా బ్యారేజీకి ఎలాంటి ముప్పులేదని వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆయన శనివారం జలమండలి ఉన్నతాధికారులతో కలిసి మంజీరా బ్యారేజీ, బారాజ్ గేట్లు, బారాజ్ పిల్లర్లు, పంప్‌హౌజ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరానికి మంచినీరు అందించేందుకు నిర్మించిన మంజీరా బ్యారేజీకు ఎలాంటి ప్రమాదం లేదని, బారాజ్ పిల్లర్లకు పగుళ్లు ఏర్పడ్డాయని వివిధ మాధ్యమాల్లో వచ్చిన వార్తలు అవాస్తవమని చెప్పారు. బ్యారేజీకి సంబంధించిన గేట్లు, రోప్‌ల పనితీరు కూడా బాగానే ఉందన్నారు. అయితే బారాజ్ దిగువన అప్రాన్ కొంతమేరకు దెబ్బతిందని, మరమ్మతు కోసం వెంటనే ఏజెన్సీతో మాట్లాడి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే రెండో గేటు లీకేజీను అరికట్టేందుకు మరమ్మతు పనులను చేపట్టాలని స్వప్న ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్ నిర్మాణ సంస్థకు సూచించారు. అనంతరం బ్యారేజీపై గేట్లు, రోలర్, ప్యానల్ బోర్డులు, ఎలక్ట్రో మెకానికల్ తదితర భాగా లను ఎండీ పరిశీలించారు. మంజీరా బ్యారేజీ గేట్లు, రోప్‌లు, బేరింగ్‌లను మార్పునకు గతేడాది మే నెలలో రూ.3.52 కోట్లతో ప్రతిపాదనలను, టెండర్ ప్రక్రియ పూర్తిచేసి ఏజెన్సీని నియమించినట్లు చెప్పారు.



న్యూస్ బాక్స్

పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించండి

సిద్దిపేట క్రైం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని జిల్లాజడ్జి సాయి రమాదేవి పేర్కొన్నారు. శనివారం జిల్లా కోర్టులో ఆమె కలెక్టర్ హైమావతి, అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్ ఏసీపీలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోర్టు పెండింగ్ కేసులలో పోలీస్ శాఖ తరఫున తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి అవసరమైన ఆదేశాలు జారీ చేశారు. అలాగే గజ్వేల్, దుబ్బాక, సిద్దిపేట కోర్టు భవనాల స్థల సేకరణపై కలెక్టర్‌తో చర్చించారు. సమావేశంలో అడిషనల్ డిస్ట్రిక్ట్ సీనియర్ జడ్జి జయప్రసాద్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

రాయపోల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): దౌల్తాబాద్ మండలం ముబారస్‌పూర్ వద్ద గల 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ల మరమ్మతుల కారణంగా రాయపోల్ మండలంలోని అన్ని గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

నిరుద్యోగ యువతకు ఉచితంగా డేటా ఇంజనీర్ కోర్సు

గజ్వేల్ రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): శ్రీ సత్యసాయి సేవా సంస్థ నిరుద్యోగ యువత కోసం శ్రీ సత్యసాయి స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా ఉచిత డేటా ఇంజనీర్ కోర్సును అందిస్తోంది. ఈ కోర్సుకు 2022-25 మధ్య బీఎస్సీ, ఎంఎస్సీ, బీటెక్, ఎంటెక్ లేదా ఎంసీఏ పూర్తి చేసిన పట్టభద్రులు అర్హులు. ఎంపికైన అభ్యర్థులకు బేసిక్ లేదా అడ్వాన్స్‌డ్ పైథాన్, ఎస్‌క్యూ ఎల్, బీఐ టూల్స్‌తో పాటు సాఫ్ట్ స్కిల్స్‌లో 90 రోజుల పాటు శిక్షణ ఇస్తారు. ఆసక్తి ఉన్నవారు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ డాట్ ఎస్ఈటీహెచ్‌యూ డాట్ ఏఐ లో నమోదు చేసుకోవచ్చు. లేదా 9052372023కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చు.

ప్రజావాణి నిర్వహించాలి

చేర్యాల, జూన్ 28(ఆంధ్రజ్యోతి): చేర్యాల తహసీల్ కార్యాలయంలో ప్రతీ సోమవారం ప్రజావాణి ఏర్పాటుచేసి ప్రజలు, రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం నాయకులు చేర్యాల తహసీల్దారు దిలీప్‌నాయక్‌కు వినతిపత్రం అందించారు. జిల్లా అధ్యక్షుడు కత్తుల భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో ప్రజావాణి జరిపేవారని, కొంతకాలం క్రితం నిలిచిపోయిందని, ప్రత్యేకచొరవ వహించి వచ్చే సోమవారం నుండి మండలస్థాయి ప్రజావాణి చేపట్టాలని కోరారు.

సింగన్నగూడ ఉన్నత పాఠశాలలో సైకిళ్ల పంపిణీ

ములుగు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా రోటరీ 3150 సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని పీడీజీ రవి వడ్లమాని అన్నారు. వచ్చే నవంబర్ 14న చిల్డ్రన్స్ డే సందర్భంగా వెయ్యి సైకిళ్లను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. శనివారం ములుగు మండలం సింగన్నగూడ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్, హెల్ప్ టు నీడ్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో సైకిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీజీలు, క్లబ్ చైర్మన్‌లు, డీసీటీ జిల్లా డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

పప్పు దినుసుల సాగుపై రైతులకు అవగాహన

బెజ్జంకి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రైతులు పప్పు దినుసు పంటల సాగుపై మొగ్గు చూపాలని ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ, ఏవో సంతోష్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం రైతులకు పప్పు దినుసు పంటలసాగు పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండలానికి కేటాయించిన 25 కంది విత్తనాల ప్యాకెట్‌లను రైతులకు అందజేశారు.

కాలువను పునరుద్ధరించాలి

చిన్నకోడూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): చిన్నకోడూరులోని బ్రహ్మణుల చెరువు నుంచి అమ్మ కుంటకు అక్కడి నుంచి మండలంలోని ఇబ్రహీంనగర్ చెరువుకు మత్తడి నీరు పోయే కాలువ పూడ్చివేతకు గురైందని దానిని తిరిగి పునరుద్ధరించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిసె ప్రభు కోరారు. ఈ మేరకు సిద్దిపేట ఆర్డీవో కార్యాలయంలో శనివారం ఆర్డీవో సదానందానికి ఆయన వినతి పత్రం అందజేశారు. కాలువ పూడ్చి వేతకు గురై చెరువుల మత్తడి నీరు పొలాల్లో నుంచి ప్రవహించడంతో సుమారు 500 ఎకరాల భూమిని రైతులు సాగు చేయలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

చిరు జల్లులు కురిసినా.. ఇక్కట్లే

- రెండేళ్ల క్రితమే సూరంపల్లి కెనాల్‌పై బ్రిడ్జి నిర్మాణం
- రోడ్డు మధ్య గుంతలో నిలుస్తున్న నీరు
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో వాహనదారులకు తప్పని ఇబ్బందులు



దౌల్తాబాద్,జూన్ 28 (ఆంధ్రజ్యోతి): చినుకు పడితే చాలు నడి రోడ్డుపై నీటి కుంటల మారుతుంది. ప్రతినిత్యం రద్దీగా ఉండే రోడ్డుపై నీరు నిలవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. దౌల్తాబాద్ మండల పరిధిలోని సూరంపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాల సమీపంలో నాలుగేళ్ల క్రితం బీటీ రోడ్డు నిర్మించారు. రోడ్డు నిర్మాణ సమయంలో రహదారికి అడ్డంగా కెనాల్ పనులు జరుగుతుండడంతో బ్రిడ్జి పనుల కోసం ఆ మేరకు రోడ్డు పనులను ఆపేసి మిగతా పనులను పూర్తి చేశారు. కాగా రెండేళ్ల క్రితం బ్రిడ్జి పనులు సైతం పూర్తి చేశారు. రోడ్డుపై బ్రిడ్జి నిర్మాణం సమయంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో బ్రిడ్జిపై గుంత ఏర్పడింది. దీంతో చిన్న వర్షం చినుకు పడినా రోడ్డుపై నీటి కుంటలా మారింది. ఎదురెదురుగా వచ్చే వాహనదారులు ఆ నీళ్ల తమపై పడతాయేమోనని జంకుతూ రాకపోకలు సాగిస్తున్నారు. ప్రతినిత్యం సిద్దిపేట నుంచి దౌల్తాబాద్‌కు ఉద్యోగులు, ఇతర ప్రజలు ప్రయాణం చేస్తుంటారు. ఈ రోడ్డుపై వర్షపు నీరు నిలవకుండా చేయాలని వాహనదారులు, స్థానికులు సంబంధిత ఆర్ డబ్ల్యూఎస్, ఇరిగేషన్ అధికారులను కోరుతున్నారు.

ఆర్థిక సంస్కరణల రూపశిల్పి పీవీ



సురభి ఫార్మసీ కళాశాలలో పీవీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు

గజ్వేల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంస్కరణల రూపశిల్పి, తెలంగాణ ఖ్యాతిని ఖండాంతరాలకు చాటిన మహామేధావి, పీవీ నర్సింహారావు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని సురభి దయాకర్‌రావు ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాచర్ల వెంకట రమణ కొనియాడారు. పీవీ నరసింహారావు జయంతిని పురస్కరించుకొని గజ్వేల్ మండలం రిమ్మనగుడ సమీపంలో గల సురభి దయాకర్‌రావు ఫార్మసీ కళాశాలలో పీవీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ బిడ్డగా ప్రజలు గర్వపడాల్సిన పీవీ నరసింహారావు అందించిన స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. వారితో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గణేష్, సిబ్బంది డాక్టర్ స్వాతి, చెరుకు నరేశ్‌రెడ్డి, సౌమ్య, సౌందర్య, పూజిత, బి.అరుణ, శ్రీముఖి, లుబ్నా, రాజేశ్వరి, అరుణ, ప్రవీణ్, కరుణాకర్, రజిత, అనిల్, లింగం పాల్గొన్నారు.

● **కోహెడ:** కోహెడ మండలకేంద్రంలో మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నరసింహారావు 104వ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. సామాజిక వేత్త పిడిశెట్టి రాజు పీవీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రైవేట్ హాస్పిటల్‌లోని రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. నాంపల్లి రామయ్య, రాచూరి మల్లేశం, శ్రీనివాస్, శంకర్, మహేష్, రమేశ్ ఉన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మద్దూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : దూళిమిట్ట మండల కేంద్రంలోని మోయతుమ్మద వాగు ద్వారా ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు పట్టుకొని మద్దూరు పోలీసులకు అప్పగించారు. శనివారం తహసీల్దారు మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎలాంటి అనుమతులు లేకుండా నంగునూర్ మండలం ఖాతా గ్రామానికి చెందిన పరమేష్, తిరుపతి రెడ్డి అనే వ్యక్తులు ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తుండగా రెవెన్యూ సిబ్బంది పట్టుకున్నట్లు తెలిపారు.

అంబులెన్స్‌లో మహిళ ప్రసవం



బిడ్డను బంధువుకు అప్పగిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

గజ్వేల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): అంబులెన్స్‌లో మహిళ ప్రసవించింది. గజ్వేల్ మండలం పిడిచెడ్ గ్రామానికి చెందిన కళ్యాణిని ప్రసూతి కోసం జగదేవ్‌పూర్ 108 అంబులెన్స్‌లో గజ్వేల్ ఆసుపత్రికి తరలించగా, గాంధీ ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఈ క్రమంలో గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో వర్గల్ మండలం గౌరారం వద్ద నొప్పులు ఎక్కువ అవడంతో ఈఎంటీ మహేందర్ ప్రసవం చేశారు. పండంటి మగబిడ్డకు కళ్యాణి జన్మనిచ్చింది. ప్రస్తుతం ఇద్దరు సేఫ్‌గా ఉన్నారని వైద్యులు తెలిపారు.

విద్యార్థులకు రక్షణ చట్టాలపై అవగాహన



గజ్వేల్‌లోని కేజీబీవీ విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ, మద్దూరు ఉన్నత పాఠశాలలో ఎస్ఐ

గజ్వేల్/మద్దూరు/కొండపాక, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో శనివారం పోలీసులు సైబర్ నేరాలు, మహిళల రక్షణ చట్టాలు, ఈవ్ టీజింగ్, మత్తు పదార్థాల రవాణ తదితర అంశాలపై విద్యార్థులు, యువతకు అవగాహన కల్పించారు. గజ్వేల్ పట్టణంలోని కేజీబీవీ స్కూల్ విద్యార్థినులకు గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి సైబర్ నేరాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ చాలా కీలకమని, సద్వినియోగం చేసుకుంటే బాగుపడతారని, దుర్వినియోగం చేసుకున్న వారు బాధపడతారని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి అనురాధ, ఉపాధ్యాయులు, గజ్వేల్ షీటీమ్ సిబ్బంది మహేందర్ రెడ్డి, శ్యామల, లావణ్య, మహేష్, రామచంద్రారెడ్డి, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు. మద్దూరు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు మహిళల రక్షణ చట్టాలు, షీటీం నిర్వహిస్తున్న విధులపై శనివారం ఎస్ఐ షేక్ మహబూబ్ అలీ వివరించారు. ర్యాగింగ్, పోక్సో, షీ టీమ్స్, నూతన చట్టాల గూర్చి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో షీటీం బృందం హెడ్‌కానిస్టేబుల్ సదయ్య, మహిళా కానిస్టేబుల్ ప్రశాంతి, స్వప్న, కానిస్టేబుల్ కృష్ణ ఉన్నారు. కొండపాక మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పలు అంశాలపై కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ అవగాహన కల్పించారు. సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించాలని సూచించారు. సామాజిక రుగ్మతల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సముద్రాల శ్రీనివాస్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దొంగా.. దొంగా

(5వ పేజీ తరువాయి)

జరిగాయి. ఎర్రొళ్ల మల్లయ్య తాను ధాన్యం విక్రయించగా వచ్చిన డబ్బు రూ.56 వేలు, 18 తులాల వెండి పట్టీలు చోరీకి గురయ్యాయి. ఇక గంగాధర భిక్షపతి ఇంట్లోనూ రూ.17,500 నగదు, వెండి, బంగారు ఆభరణాలు అపహరించారు. ఇప్పటికీ దొంగల జాడ కానరాలేదు.

- బెజ్జంకి మండలం గుగ్గిళ్లలో ఈనెల 21వ తేదీన కేడిక కిష్టారెడ్డి అనే రైతు ఇంట్లో దొంగలు చొరబడి రూ.4.20 లక్షల నగదు, తులం బంగారం, 13 తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. శరీరానికి నల్లటి ఆయిల్ పూసుకొని కత్తులతో బెదిరించి పారిపోయారని బాధితులు తెలిపారు. నిందితుల కోసం పోలీసులు గాలిస్తూనే ఉన్నారు.
- మద్దూరు మండలం లద్నూరులో పట్టపగలే ఇళ్ల తాళాలు పగలగొట్టి చోరీకి యత్నించిన ఐదుగురు మహిళలను గ్రామస్థులే పట్టుకున్నారు.
- గజ్వేల్ పట్టణంలోని బాలాజీ థియేటర్ సమీపంలో గడియారం బాలమణి అనే వృద్ధురాలిని మే 8వ తేదీన నగల కోసం హత్య చేశారు. ఈ హత్యకు పాల్పడిన నిందితురాలిని మరుసటి రోజే పోలీసులు అరెస్టు చేశారు.
- కొమురవెల్లి మండల కేంద్రానికి చెందిన పోతుగంటి కొమురెల్లి ఇంట్లో ఈనెల 25వ తేదీన దొంగలు పడ్డారు. 5 తులాల బంగారం, 20 తులాల వెండి, రూ.50 వేల నగదు అపహరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.
- గత ఏప్రిల్ 30వ తేదీన కొమురవెల్లి ఆలయం ముందు ఊడుస్తున్న ఓ మహిళ మెడలోని 5 తులాల బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకుపోయారు. ఇప్పటికీ రికవరీ కాలేదు.
- కొండపాక మండల మర్పడగలోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలో మే 12వ తేదీన చోరీ జరిగింది. తలుపులు పగలగొట్టి వస్తువులు అపహరించారు.

యువత సన్మార్గం కోసం దీక్ష... హుస్నాబాద్ జేఏసీ పోరుయాత్ర

(5వ పేజీ తరువాయి)

అత్యాచారాలు వంటి దారుణాలను ఉదహరిస్తూ యువతలో చైతన్యం తీసుకువస్తున్నారు. ఈ పోరుయాత్రకు మహిళా సంఘాలు, అన్ని వర్గాల ప్రజలు, ప్రజా సంఘాలు, విద్యా సంస్థలు, విశ్రాంత ఉద్యోగులు, విద్యార్థి సంఘాలు, సామాజిక వేత్తలు, రైతులు, కార్మికులు, రాజకీయ పార్టీలు మద్దతుగా నిలవాలని టీజేఏసీ హుస్నాబాద్ నియోజకవర్గ నాయకులు పిలుపునిచ్చారు. హుస్నాబాద్‌ను మాదక ద్రవ్యాల నిర్మూలనలో రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలపాలని సంకల్పించారు.

ఉద్యమ తరహా పోరు అవసరం



మాదక ద్రవ్యాల విక్రయం పట్టణాల నుంచి పల్లెలకు విస్తరించింది. గతంలో రచ్చబండలున్న చోట ఇప్పుడు మత్తు మండపాలుగా మారాయి. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకుని తెలంగాణ ఉద్యమం, సారాయి వ్యతిరేక ఉద్యమం తరహాలో డ్రగ్స్‌పై పోరాడితేనే డ్రగ్స్ రహిత తెలంగాణ సాధ్యమవుతుంది.

– ఎం.వీరన్న యాదవ్, నియోజకవర్గ జేఏసీ కోఆర్డినేటర్

బెల్ట్‌షాపులు మూయించాలి



మత్తు పదార్థాల నివారణతో పాటు గ్రామాల్లో విచ్చలవిడిగా వెలసిన బెల్ట్ షాపులను తక్షణమే మూసివేసేందుకు పోరాడాలి. గంజాయి, డ్రగ్స్‌తో యువత పెడదారి పడుతోంది. పల్లెల్లో ఇలాంటి మత్తు విక్రయాలను విక్రయించకుండా నిలిపివేయాలి. తల్లిదండ్రులు తమ పిల్లలను ఓ కంట కనిపెడుతూ ఉండాలి.

– గొండ్ల పద్మ, మహిళా సంఘాల నాయకురాలు

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంది



సిద్దిపేట రూరల్: చిన్నగుండవెల్లిలో ఇందిరమ్మ ఇంటి పనులను ప్రారంభిస్తున్న పూజల హరికృష్ణ



దౌల్తాబాద్:తిర్మలాపూర్‌లో ఇందిరమ్మ ఇంటి పనులకు భూమి పూజ చేస్తున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేట రూరల్/దౌల్తాబాద్/రాయపోల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు గ్రామాల్లో శనివారం కాంగ్రెస్ నాయకులు స్థానిక అధికారులతో కలిసి శనివారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతీ మాటకు కట్టుబడి ఉందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. సిద్దిపేట రూరల్ మండలం చిన్నగుండవెళ్లి, పుల్లూరు, పెద్దలింగారెడ్డిపల్లి, నారాయణరావుపేట మండల కేంద్రంతో పాటు గోపులాపూర్, జక్కాపూర్, మల్యాల గ్రామాల్లో సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులకు భూమి పూజల ప్రారంభించారు. వెంట కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రాములు, రామచంద్రం, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు యాదగిరి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చింతల రాజ్‌వీర్,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కరుణాకర్, నాయకులు పాల్గొన్నారు. దౌల్తాబాద్, రాయపోల్ మండలాల్లోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు దుబ్బాక నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు బిల్లుల కోసం ఎవరికీ డబ్బులు ఇవ్వవద్దని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో దౌల్తాబాద్, రాయపోల్ మండల పార్టీ అధ్యక్షులు పడాల రాములు, సుధాకర్, ఆత్మ కమిటీ చైర్మన్లు రవీందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న ఏఆర్ అడిషనల్ డీసీపీ

చిన్నకోడూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ గేమ్స్ బెట్టింగ్ జోలికి వెళ్లి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్ సూచించారు. చిన్నకోడూరు మండలం పెద్దకోడూరు శివారులోని సీఏఆర్ హెడ్ క్వార్టర్‌లో జిల్లాలోని సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసు సిబ్బందికి శనివారం నిర్వహించిన వీక్లీ పరేడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బంది ప్రదర్శించిన ఆర్మ్స్, స్క్వాడ్ డ్రిల్ పరిశీలించి పలు సూచనలు చేసి మాట్లాడారు. కార్యక్రమంలో సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు రాజేష్, కార్తీక్, ఇన్‌స్పెక్టర్లు వాసుదేవరావు, ఉపేందర్, విద్యాసాగర్, ప్రవీణ్ కుమార్, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

షార్‌ను సందర్శించిన బేగంపేట విద్యార్థులు



షార్ కేంద్రంలో బేగంపేట విద్యార్థులు

రాయపోల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలం బేగంపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు విజ్ఞాన యాత్రలో భాగంగా శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరి కోటలోని సతీష్‌ధావన్ అంతరిక్ష పరిశోధనా కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు భారత అంతరిక్ష ప్రయోగాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రత్యక్షంగా చూశారు. ప్రయోగాలు, ఉపగ్రహ ప్రక్షేపణలపై ఉపాధ్యాయులు వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నవీన్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, సంజీవ్, దివాకర్, ప్రభాకర్, వసంత, రాజేంద్ర పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించిన ఘనత పీఆర్టీయూదే



గౌరారంలో వెంకట్‌రెడ్డి ఉద్యోగ విరమణ అభినందన సభలో జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి

వర్గల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించిన ఘనత పీఆర్టీయూదేనని ఉపాధ్యాయ శాసన మండలి సభ్యుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం వర్గల్ మండలం గౌరారంలో పీఆర్టీయూ మండలశాఖ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన చౌదరిపల్లి జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు ఇటిక్యాల వెంకట్‌రెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించడంలో పీఆర్టీయూ కు ఏళ్ల తరబడి చరిత్ర ఉందన్నారు. ప్రభుత్వం ద్వారా మరికొన్ని సమస్యలను నేరవేర్చుకునేందుకు మన సంఘం ముందుందన్నారు. ఉద్యోగ విరమణ పొందిన వెంకట్‌రెడ్డి సలహాలు, సూచలను పీఆర్టీయూకు అందించాలన్నారు. అనంతరం ఇటిక్యాల వెంకట్‌రెడ్డి దంపతులను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మన్, ఎమ్మెల్సీగా పోటీ చేసిన అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి శశిధర్ శర్మ, ఎంఈవో సునీత, కాంప్లెక్స్ హెచ్ఎంలు కనకరాజు, సౌజన్య, సంఘ నాయకులు తదితరులు ఉన్నారు.

స్థానిక ఎన్నికల్లో యువజన నాయకులకు అవకాశం

● రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి

వర్గల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ నాయకులకు అవకాశం కల్పిస్తామని, అందుకు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి పార్టీ శ్రేణులకు సూచించారు. శనివారం వర్గల్ మండలం మల్లారెడ్డిపల్లికి వచ్చిన ఆయనకు సిద్దిపేట జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అనిల్‌రెడ్డి స్వాగతం పలుకుతూ శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం శివచరణ్‌రెడ్డి మాట్లాడుతూ ఎప్పుడు ఎన్నికలు వచ్చినా యువజన కాంగ్రెస్ నాయకులు సిద్ధంగా ఉండాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన నాయకులు ఖలీద్ అహ్మద్, శ్యామ్‌సుందర్‌రెడ్డి, మజీద్‌ఖాన్, ఎర్రమల్ల రామ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండాలు ఆవిష్కరించాలి

సిద్దిపేట అర్బన్/చేర్యాల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 31వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూలై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ జెండాను గ్రామ గ్రామాన ఎగురవేసి మాదిగల ఆత్మ గౌరవాన్ని చాటాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి మందకుమార్ పిలుపునిచ్చారు. శనివారం సిద్దిపేట, చేర్యాల మండలాల్లో వేర్వేరుగా ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ ఆవిర్భావ దినోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జిలను నియమించినట్టు తెలిపారు. గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జిలుగా ఉబ్బని అంజనేయులు, బుడిగే మహేష్, సిద్దిపేటకు జేపీ లక్ష్మణ్, కొలిమి మల్లేశం, చుంచు రమేష్ మాదిగ, దుబ్బాకకు మొక్కపల్లి రాజు, చెంచు రమేష్, హిస్టారికల్ ఎల్లం, మైన రాములును నియమించామన్నారు. అలాగే హుస్నాబాద్‌కు పేరుక పరశురాములు, జేపీ లతా, మదీనా లక్ష్మీనారాయణ, వెంకటస్వామి, చేర్యాలకు సనవాల ప్రసాద్, సుందరగిరి, భాస్కర్, గడిపె బాల నరసయ్యను నియమించామన్నారు.

ఉచిత వైద్యశిబిరం సద్వినియోగం చేసుకోవాలి

చేర్యాల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్స్ డేను పురస్కరించుకుని సికింద్రాబాద్ యశోద ఆస్పత్రి సహకారంతో చేర్యాల డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూలై 1న స్థానిక అక్షర హాస్పిటల్‌లో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు రామగల్ల పరమేశ్వర్ పేర్కొన్నారు. శనివారం చేర్యాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చేర్యాల ప్రాంతంలోని పోలీస్, జర్నలిస్టులు, న్యాయవాదులతో పాటు మునిసిపల్ సిబ్బందికి ఉచిత గుండె జబ్బుల నిర్ధారణ శిబిరాన్ని ఏర్పాటుచేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు తుంగ రఘునందన్ రాణా, ఎడెల్లి సంతోశ్, దయానంద్, శ్రీవాత్సవ, శివ, ప్రణీత్, అనంత్‌కుమార్ పాల్గొన్నారు.

మంత్రిగారూ.. వట్టి మాటలు కట్టిపెట్టి
పని చేసి చూపండి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్

హుస్నాబాద్ టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వట్టి మాటలు కట్టిపెట్టి పని చేసి చూపించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ ఘాటుగా విమర్శించారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ మా ఇంటికి వచ్చినా నియోజకవర్గానికి ఒక్క పని చేయలేదని అనడం మంత్రి పొన్నంకు ఊతపదం అయ్యిందని, ఇంకోసారి అలా మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. శనివారం ఆయన హుస్నాబాద్ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నేను గొప్పోడిని అని నలుగురిని తీసుకొచ్చుకొని చెప్పించుకోవడం కాదు, మాటలు పక్కన బెట్టి పని చేసి చూపించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం నీవు హుస్నాబాద్‌లో ఉండేది కేసీఆర్ నిర్మించిన ఇంట్లోనే అనేది గుర్తుంచుకోవాలన్నారు. మేం కట్టించిన పాలిటెక్నిక్ కాలేజీలోనే మీరు ఇంజనీరింగ్ కాలేజీ పెడుతున్నారనేది మరచిపోవద్దన్నారు. మెడికల్ కాలేజీ తీసుకువస్తానని గొప్పలు చెప్పుకొని ఇప్పుడు సాధ్యం కాదు 50 సీట్ల పీజీ కళాశాల మంజూరు చేస్తామంటున్నారని, మెడికల్ కాలేజీ లేకుండా పీజీ కాలేజీ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. మున్సిపల్ కార్యాలయం, ఏసీపీ కార్యాలయం, ఐవోసీ కార్యాలయం ఇవన్నీ మేం తెచ్చినవేనని, వాటిని ప్రారంభించడం గొప్పకాదన్నారు. మేం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లో గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేస్తమన్నరు.. ఇప్పటి వరకు తట్టెడు మట్టి కూడా ఎందుకు తీయలేదని, కాలువలకు ఒక్క ఎకరం భూమి ఎందుకు సేకరించలేదని ప్రశ్నించారు. హుస్నాబాద్ నుంచి కొత్తపల్లి ఫోర్‌లైన్ రహదారికి ఇప్పటికీ మంజూరే రాలేదని దీనికి శంకుస్థాపన చేయడం తగదన్నారు. సమావేశంలో జడ్పీ మాజీ చైర్మన్ సుధీర్‌కుమార్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజారెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుద్దాల చంద్రయ్య, అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎండి అన్వర్, మాజీ ఎంపీపీలు లక్ష్మీ, ఆకుల వెంకట్, మాజీ జడ్పీటీసీ మంగ, నాయకులు పాల్గొన్నారు.